సందేశం టైమ్స్
జాతీయ తెలుగు దిన పత్రిక
సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి జిల్లాల నియోజకవర్గాల ఇన్చార్జిలు మరియు మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను ఆసక్తి గలవారు సంప్రదించండి.
శెట్టి వెంకటేష్ గౌడ్ సీఈవో
సెల్ నెంబర్ : 9052045 435,9542522611.

జాతీయ తెలుగు దినపత్రిక RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు

Download Sandesham Times
Short News App!
Speed in News.. Truth in Analysis!
Scan to Download
Download
Download Now
Get it on on Google Play

ఆదివారం 12 ఏప్రిల్ 2026 | పేజీలు : 04 | వెల - రూ 2/- | సంపుటి : 01 సంచిక : 314 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : శెట్టి వెంకటేష్




## బెంగాల్‌లో బీజేపీకి పెరుగుతున్న మద్దతు: ప్రధాని మోదీ

సందేశం టైమ్స్, కోల్‌కతా, ఏప్రిల్ 12, ప్రతినిధి: పశ్చిమ బెంగాల్‌లో కాటువా ప్రాంతంలో నిర్వహించాల్సిన జనసభకు ముందే భారీగా ప్రజలు తరలివచ్చి సభ ప్రాంగణాన్ని నింపివేయడం మార్పు గాలులకు సంకేతమని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఈ అపార ప్రజాభిమానాన్ని చూసి ఆనందం వ్యక్తం చేసిన ఆయన, దేశ ప్రజలతో తన సంతోషాన్ని పంచుకున్నారు. బెంగాల్ మట్టిలో ప్రజల హృదయ స్పందన స్పష్టంగా వినిపిస్తోందని, ఈసారి బెంగాల్‌లో బీజేపీ ప్రభుత్వం ఏర్పడటం ఖాయమని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

# జిసిసిల గమ్యస్థానంగా హైదరాబాద్ మంత్రి శ్రీధర్ బాబు



హైదరాబాద్ నగరం ప్రపంచ స్థాయి గ్లోబల్ సామర్థ్య కేంద్రాల (జిసిసిల) ఏర్పాటుకు అగ్రగామి గమ్యస్థానంగా మారిందని ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు

సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 12, ప్రతినిధి: ప్రపంచంలోని ప్రముఖ ఫైనాన్స్ సంస్థలు తమ గ్లోబల్ సామర్థ్య కేంద్రాల (జిసిసి) ఏర్పాటుకు హైదరాబాద్ నగరాన్ని ప్రధాన గమ్యస్థానంగా ఎంచుకుంటున్నాయని ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. నైపుణ్యంతో కూడిన టాలెంట్ పూల్, అంతర్జాతీయ ప్రమాణాల మౌలిక సదుపాయాలు, ట్రాఫిక్ సమస్యలు తక్కువగా ఉండే రహదారులు, అందుబాటులో ఉన్న అద్దెలు వంటి అంశాలు ప్రముఖ కంపెనీలను ఆకర్షిస్తున్నాయని ఆయన వివరించారు. న్యూయార్క్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహించే పికో టెక్నాలజీ సంస్థ ప్రతినిధులు బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబును కలుసుకోగా, ఫైనాన్షియల్ మార్కెట్ సేవలు అందించే ఈ సంస్థ పికో టెక్నాలజీ ఇండియా ద్వారా హైదరాబాద్‌లో జిసిసి ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చిందని తెలిపారు. రానున్న 5 నుంచి 10 సంవత్సరాలు, అలాగే 20 సంవత్సరాల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రణాళికలు అమలు చేస్తున్నామని చెప్పారు. బెంగళూరు, ముంబై నగరాలతో పోలిస్తే హైదరాబాద్‌లో ఆఫీస్ స్థలాల ఆక్యుపెన్సీ 73 శాతంగా ఉండగా, ముంబైలో అది 52 శాతం మాత్రమేనని పేర్కొన్నారు. ట్రాఫిక్, వాయు కాలుష్యం సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో ఐటీ సంస్థలు హైదరాబాద్ వైపు మళ్లుతున్నాయని వెల్లడించారు. ఇదే సమయంలో ఆర్ అండ్ బి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ నెహ్రూ రింగ్ రోడ్డుకు 30 కిలోమీటర్ల దూరంలో రీజనల్ రింగ్ రోడ్డును నిర్మిస్తున్నామని, దానికి అనుబంధంగా రేడియల్ రోడ్లను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. రింగ్ రోడ్ల వెంట రైలు మార్గాలు కూడా ఏర్పాటు చేసి రవాణా సదుపాయాలను మరింత మెరుగుపరుస్తున్నామని తెలిపారు. హయత్‌నగర్-ఎల్బీనగర్ మధ్య డబుల్ డెక్కర్ రోడ్డు నిర్మాణం చేపడుతున్నామని, కింది రహదారి స్థానిక ట్రాఫిక్‌కు, పై అంతస్తులు నగరానికి వచ్చే, వెళ్లే వాహనాలకు వినియోగిస్తామని వివరించారు. నాగపూర్ తర్వాత ఈ తరహా డబుల్ డెక్కర్ రోడ్లు నిర్మిస్తున్న నగరం హైదరాబాద్‌నేనని పేర్కొన్నారు. రెండు నెలల్లో టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామని చెప్పారు. సమావేశంలో పికో టెక్నాలజీ వ్యవస్థాపక సీఈఓ జారొడ్ యుస్టర్, పికో ఇండియా సీఈఓ హరి కోదండరామన్, డైరెక్టర్ సీతారాం తదితరులు పాల్గొన్నారు.

## పేదల ఇళ్ల నిధులు నిలిపివేసింది వైసీపీ: నారా లోకేష్ ఆరోపణ



సందేశం టైమ్స్, అమరావతి, ఏప్రిల్ 12, ప్రతినిధి: 2 లక్షల 73 వేల మంది పేదలు ఇళ్లు నిర్మించుకున్నప్పటికీ వారికి ఇవ్వాల్సిన ఆర్థిక సహాయాన్ని వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిందని ఆంధ్రప్రదేశ్ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి నారా లోకేష్ ఆరోపించారు. ఇవి తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో మంజూరు చేసిన ఇళ్లేనని, ఆ కారణంగానే నిధుల విడుదలలో వివక్ష చూపారని విమర్శించారు. ఆ ఇళ్లను చూస్తే తన గుర్తు వస్తుందనే కారణంతో రాజకీయ కక్షతో వ్యవహరించారని, తనపై ఉన్న కోపాన్ని పేదలపై చూపారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదల సంక్షేమంపై రాజకీయాలు చేయడం తగదని, వారికి రావాల్సిన హక్కులను వెంటనే అందించాలని నారా లోకేష్ డిమాండ్ చేశారు.

# ఐటీడీఏల బలోపేతంపై హైదరాబాద్‌లో కీలక కార్యశాల

### విద్య, ఆరోగ్యం, ఉపాధిపై ఐటీడీఏల పాత్ర బలోపేతానికి నిర్ణయం నైపుణ్యాభివృద్ధి, గిరిజన





సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 12, ప్రతినిధి: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఐటీడీఏల బలోపేతానికి సంబంధించి కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్ మాసబ్‌టాంక్‌లోని గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో నిర్వహించిన ఒకరోజు కార్యశాలలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సమావేశానికి కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ డైరెక్టర్ డా. వర్నాలి డేకా ముఖ్య అతిథిగా హాజరై, గిరిజన ప్రాంతాల అభివృద్ధికి సమగ్ర ప్రణాళికల అవసరాన్ని వివరించారు. గిరిజన సంక్షేమ శాఖ సంచాలకులు శ్రీ సంతోష్ బి.ఎం., ఐఏఎస్ ఉపోద్ఘాత ప్రసంగంలో రెండు రాష్ట్రాల్లో ఐటీడీఏల ప్రస్తుత పరిస్థితి, వాటి బలోపేతం, నిధుల వినియోగం, విధానాల్లో తేడాలు వంటి అంశాలపై సమీక్ష నిర్వహించగా, విద్య, ఆరోగ్యం, జీవనోపాధి, మౌలిక సదుపాయాల అభివృద్ధిపై మరింత దృష్టి పెట్టాలని నిర్ణయించారు. గిరిజన యువతకు నైపుణ్యాభివృద్ధి, శిక్షణ, క్యాంపస్ ప్లేస్‌మెంట్ల అవసరాన్ని గుర్తిస్తూ టాస్క్ ద్వారా శిక్షణ కార్యక్రమాలపై చర్చించారు. గిరిజన హక్కుల పరిరక్షణ, అటవీ హక్కుల చట్టం అమలు, భూసమస్యల పరిష్కారం, వలసల నియంత్రణపై సమగ్ర చర్చ జరిపి గ్రామస్థాయిలో కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని నిర్ణయించారు. గిరిజన విద్యలో స్థానిక భాషల్లో బోధన, కెరీర్ గైడెన్స్, ఆశ్రమ పాఠశాలల అభివృద్ధి, ఉత్తమ ఫలితాల సాధన విధానాల విస్తరణపై దృష్టి పెట్టారు. అదనంగా గిరిజన సహకార సంస్థల ద్వారా పెట్రోల్ బంకులు, ఎల్పీజీ, విత్తనాలు, ఎరువుల కేంద్రాల ఏర్పాటు, మహిళా సంఘాల ద్వారా ఉపాధి అవకాశాల పెంపుపై చర్చించారు. పరిపాలనా సామర్థ్యాన్ని పెంచడం, విభాగాల మధ్య సమన్వయం, నిధుల సులభ విడుదలకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ఉత్తమ పద్ధతులను దేశవ్యాప్తంగా అమలు చేసేందుకు మే నెలలో జాతీయ స్థాయి వర్క్‌షాప్ నిర్వహించాలని నిర్ణయించగా, ఈ సమావేశంలో ములుగు జిల్లా కలెక్టర్ దివాకర, అదనపు సంచాలకులు విట్టా సర్వేశ్వర్ రెడ్డి, సంచాలకులు డా. సముజ్వల, సంయుక్త సంచాలకులు సంధ్యారాణి, ఆంధ్రప్రదేశ్ సంయుక్త సంచాలకులు హేమలతతో పాటు ఇరు రాష్ట్రాల ఐటీడీఏ అధికారులు పాల్గొన్నారు.

## మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా లోకేష్ ఘన నివాళులు



సందేశం టైమ్స్, అమరావతి, ఏప్రిల్ 12, ప్రతినిధి: ప్రముఖ సామాజిక తత్వవేత్త, ఉద్యమకారుడు మహాత్మా జ్యోతిరావు పూలే ద్విశతాబ్ది జయంతి సందర్భంగా ఆ మహనీయుని స్మృతికి ఘన నివాళులు అర్పిస్తున్నానని ఆంధ్రప్రదేశ్ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. దళితుల అభ్యున్నతి, అంటరానితనం నిర్మూలన, కులవ్యవస్థ నిర్మూలన కోసం పూలే జీవితాంతం కృషి చేశారని, విద్య ప్రాముఖ్యతను సమాజానికి తెలియజేసిన మహానుభావుడని కొనియాడారు. ఆయన జయంతిని ప్రజాప్రభుత్వం రాష్ట్ర పండుగగా నిర్వహించడం గర్వకారణమని పేర్కొన్నారు. సామాజిక సమస్యలపై అలుపెరుగని పోరాటం చేసిన గొప్ప సంఘ సంస్కర్త పూలే అని అన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని సమానత్వ సమాజ నిర్మాణం, వారి ఆశయ సాధన కోసం అందరం కృషి చేయాలని మంత్రి నారా లోకేష్ పిలుపునిచ్చారు.

# ఐటీడీఏల బలోపేతానికి సమగ్ర కార్యాచరణపై చర్చలు



సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 12, ప్రతినిధి: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఐటీడీఏల బలోపేతానికి కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్ మాసబ్‌టాంక్‌లోని గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో నిర్వహించిన ఒకరోజు కార్యశాలలో కీలక అంశాలపై విస్తృత చర్చ జరిగింది. ఈ సమావేశానికి కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ డైరెక్టర్ డా. వర్నాలి డేకా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమ ప్రారంభంలో గిరిజన సాంస్కృతిక, శిక్షణా సంస్థ సంచాలకులు డా. వి. సముజ్వల తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి హాజరైన అధికారులకు స్వాగతం పలికారు. అనంతరం గిరిజన సంక్షేమ శాఖ సంచాలకులు శ్రీ సంతోష్ బి.ఎం., ఐఏఎస్ ఉపోద్ఘాత ప్రసంగంలో ఐటీడీఏల ప్రస్తుత పరిస్థితి, బలోపేత చర్యలు, నిధుల వినియోగం, విధానాల మధ్య తేడాలపై సమీక్ష నిర్వహించారు. విద్య, ఆరోగ్యం, జీవనోపాధి, మౌలిక సదుపాయాల అభివృద్ధిపై మరింత దృష్టి పెట్టాలని నిర్ణయించగా, గిరిజన యువతకు నైపుణ్యాభివృద్ధి, శిక్షణ, క్యాంపస్ ప్లేస్‌మెంట్ల అవసరాన్ని గుర్తించారు. టాస్క్ ద్వారా శిక్షణ కార్యక్రమాలపై చర్చించారు. గిరిజన హక్కుల పరిరక్షణ, అటవీ హక్కుల చట్టం అమలు, భూమి సమస్యల పరిష్కారం, వలసల నియంత్రణపై సమగ్ర చర్చ జరిపి గ్రామస్థాయిలో కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని నిర్ణయించారు. గిరిజన విద్యలో స్థానిక భాషల్లో బోధన, కెరీర్ గైడెన్స్, ఆశ్రమ పాఠశాలల అభివృద్ధి, ఉత్తమ ఫలితాల సాధన విధానాల విస్తరణపై దృష్టి పెట్టారు. అదనంగా గిరిజన సహకార సంస్థల ద్వారా పెట్రోల్ బంకులు, ఎల్పీజీ, విత్తనాలు, ఎరువుల కేంద్రాల ఏర్పాటు, మహిళా సంఘాల ద్వారా ఉపాధి అవకాశాల పెంపుపై చర్చించారు. పరిపాలనా సామర్థ్యాన్ని పెంచడం, విభాగాల మధ్య సమన్వయం, నిధుల సులభ విడుదలకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ఉత్తమ పద్ధతులను దేశవ్యాప్తంగా అమలు చేసేందుకు మే నెలలో జాతీయ స్థాయి వర్క్‌షాప్ నిర్వహించాలని నిర్ణయించగా, ఈ సమావేశంలో ములుగు జిల్లా కలెక్టర్ దివాకర, అదనపు సంచాలకులు విట్టా సర్వేశ్వర్ రెడ్డి, సంచాలకులు డా. సముజ్వల, సంయుక్త సంచాలకులు సంధ్యారాణి, ఆంధ్రప్రదేశ్ సంయుక్త సంచాలకులు హేమలతతో పాటు ఇరు రాష్ట్రాల ఐటీడీఏ అధికారులు పాల్గొన్నారు.



# చదువుతోనే సామాజిక విముక్తి సాధ్యం: ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 12, ప్రతినిధి: మహాత్మ జ్యోతిబా పూలే జయంతి సందర్భంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో పార్టీ అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పాల్గొని పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో విద్యా విప్లవానికి నాంది పలికిన మహనీయుడు జ్యోతిబా పూలే అని కొనియాడారు. కుల వివక్షకు వ్యతిరేకంగా, అణగారిన వర్గాల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం అజరామరమని పేర్కొన్నారు. ముఖ్యంగా స్త్రీ విద్య కోసం పూలే దంపతులు చేసిన కృషి నేటి సమాజానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. “చదువు లేకపోతే తెలివి నశిస్తుంది, తెలివి లేకపోతే నీతి తప్పుతుంది” అనే పూలే సూక్తిని ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని కోరారు. బహుజన బిడ్డలు విద్యావంతులై రాజ్యాధికారం దిశగా అడుగులు వేయడమే పూలేకు ఇచ్చే నిజమైన నివాళి అని పిలుపునిచ్చారు. పూలే ఆశయాలను గ్రామ గ్రామానికి తీసుకెళ్లి సామాజిక మార్పు కోసం తెలంగాణ రాజ్యాధికార పార్టీ కట్టుబడి పనిచేస్తుందని మల్లన్న స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## వట్పల్లిలో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం

సందేశం టైమ్స్, వట్పల్లి, ఏప్రిల్ 12, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండలంలోని రక్షకభట నిలయంలో రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు సురక్షిత ప్రయాణంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్‌హెచ్‌ఓ లవ కుమార్, ఎస్ఐ శ్రీహరి ఆధ్వర్యం వహించారు. ఈ సందర్భంగా "అరైవ్ అండ్ అలైవ్" అంశంపై గ్రామ సర్పంచులకు ప్రత్యేకంగా అవగాహన కల్పిస్తూ ప్రమాదాలకు ప్రధాన కారణాలుగా మానవ తప్పిదాలేనని అధికారులు తెలిపారు. తప్పుదారి ప్రయాణం, మద్యం సేవించి వాహనం నడపడం, హెల్మెట్ ధరించకపోవడం, పరధ్యానంలో డ్రైవింగ్ చేయడం, లైసెన్స్, ఆర్‌సి, ఇన్సూరెన్స్ లేకుండా వాహనాలు నడపడం, ముగ్గురు ప్రయాణించడం, అధిక వేగం, సెల్‌ఫోన్ ఉపయోగిస్తూ డ్రైవింగ్ చేయడం, ట్రాఫిక్ నియమాలను పాటించకపోవడం వంటి అంశాలను ప్రస్తావించారు. గ్రామ సర్పంచులు గ్రామ పాలనతో పాటు రోడ్డు భద్రతపై కూడా దృష్టి పెట్టాలని, ప్రజలకు అవగాహన కల్పించి ప్రమాదాలను తగ్గించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి గ్రామంలో విలేజ్ లెవల్ రోడ్ సేఫ్టీ కమిటీ ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ కాచూర్ రావుతో పాటు వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ భవనంలో మహాత్మా జ్యోతిరావు పూలేకు ఘన నివాళులు



సందేశం టైమ్స్, నారాయణఖేడ్, ఏప్రిల్ 12, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని అంబేద్కర్ భవనంలో మహాత్మా జ్యోతిరావు పూలే 199వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నేషనల్ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర వైస్ చైర్మన్ వై. పండరి, సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బైండ్ల కృష్ణ ప్రధాన అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా న్యాయవాది నాథన్ డానీ, సంజయ్ తదితరులు పాల్గొని పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ సమాజంలోని అణగారిన వర్గాల అభ్యున్నతికి మహాత్మా పూలే చేసిన సేవలను స్మరించుకున్నారు. విద్య ప్రాధాన్యత, సమానత్వం, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన కృషి అందరికీ ఆదర్శమని పేర్కొన్నారు. సమాజ అభివృద్ధి కోసం పూలే ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు.



## తూమ్నూర్ గ్రామంలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి ఘనంగా

సందేశం టైమ్స్, నారాయణఖేడ్, ఏప్రిల్ 12, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గంలోని మానూర్ మండల పరిధిలో తూమ్నూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో మహాత్మా జ్యోతిరావు పూలే 199వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ సంజీవ్ ఆధ్వర్యం వహించగా, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువత, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ సమాజంలోని అణగారిన వర్గాల అభ్యున్నతికి మహాత్మా పూలే చేసిన సేవలను స్మరించుకున్నారు. విద్యా విస్తరణ, మహిళా సాధికారత, సామాజిక సమానత్వం కోసం ఆయన చేసిన కృషి అందరికీ ఆదర్శమని పేర్కొన్నారు. పూలే ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని పిలుపునిస్తూ కార్యక్రమం గ్రామంలో ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది.

## మహాత్మా జ్యోతిరావు పూలే 199వ జయంతి వేడుకలు ఘనంగా



సందేశం టైమ్స్, అందోల్, ఏప్రిల్ 12, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా అందోల్ మండలం జోగిపేట పట్టణంలోని హనుమాన్ జంక్షన్ వద్ద మహాత్మా జ్యోతిరావు పూలే 199వ జయంతి వేడుకలను స్థానిక నాయకులు, సామాజిక కార్యకర్తలు మరియు ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే భారతదేశంలో సామాజిక సమానత్వం కోసం పోరాడిన గొప్ప మహానుభావుడని కొనియాడారు. మహిళా విద్య, దళితుల అభ్యున్నతి కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. సమాజంలో ఉన్న అసమానతలను తొలగించి పూలే చూపిన మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. యువత ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ప్రజలు, యువకులు, స్థానిక ప్రముఖులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.




## అల్లాదుర్గంలో బేతాళ స్వామి జాతరలో పసి బండ్ల ఊరేగింపు, భక్తుల సందడి

సందేశం టైమ్స్, అల్లాదుర్గం, ఏప్రిల్ 12, ప్రతినిధి: మెదక్ జిల్లా అల్లాదుర్గం మండల కేంద్రంలో బేతాళ స్వామి జాతర సందర్భంగా పసి బండ్ల ఊరేగింపును ఘనంగా నిర్వహించగా భక్తులతో ప్రాంతం కిటకిటలాడింది. మండలంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారికి తమ మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు కోరుకున్న కోరికల మేరకు బండ్ల ఊరేగింపులు నిర్వహించగా గొర్రెకల్ గ్రామానికి చెందిన చాకలి విట్టల్, చాకలి యాదగిరి ప్రత్యేకంగా ఎడ్ల బండిని సమర్పించారు. గ్రామాల నుంచి వచ్చిన భక్తులు భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ప్రాంతీయంగా విశేష ప్రాధాన్యం కలిగిన అల్లాదుర్గంలోని బేతాళ స్వామి దేవాలయంలో ప్రతి సంవత్సరం జాతర వేడుకలు వైభవంగా జరుగుతుండగా వేలాది మంది భక్తులు పాల్గొని తమ కోరికలు కోరుకుంటున్నారు.

## అవినీతిపై రాజీ లేదు: పోలీసులకు డీజీపీ కఠిన హెచ్చరిక




సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 12, ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర పోలీసు విభాగానికి డీజీపీ శివధర్ రెడ్డి కఠిన హెచ్చరిక జారీ చేశారు. ఖాకీ యూనిఫామ్ ధరించిన ప్రతి ఒక్కరూ అవినీతి నుంచి దూరంగా ఉండాలని స్పష్టం చేస్తూ, శాంతి భద్రతలను కాపాడాల్సిన పోలీసులు అక్రమ సంపాదనకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇటీవలి కాలంలో ఏసీబీ దాడుల్లో పోలీసు సిబ్బంది పట్టుబడుతున్న ఘటనలు శాఖ ప్రతిష్టను దెబ్బతీస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. హోమ్ గార్డ్ నుంచి ఐపీఎస్ స్థాయి వరకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో, నిజాయితీతో విధులు నిర్వహించాలని సూచించారు. లంచం తీసుకుంటే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేస్తూ "ఫెయిర్, ఫర్మ్, ఫ్రెండ్లీ, ప్రొఫెషనల్" విధానమే పోలీసుల లక్ష్యంగా ఉండాలని గుర్తుచేశారు.




## అంబేద్కర్ జయంతి సందర్భంగా ఏప్రిల్ 14న దేశవ్యాప్తంగా సెలవు

సందేశం టైమ్స్, న్యూఢిల్లీ, ఏప్రిల్ 12, ప్రతినిధి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఏప్రిల్ 14న దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, బ్యాంకులకు సెలవు ప్రకటించారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ (డోప్ట్) అధికారిక సర్క్యులర్ విడుదల చేసింది. ఈ నిర్ణయంతో దేశవ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు ఏప్రిల్ 14న మూసివేయబడనున్నాయి.

## చిన్న చెల్మెడలో సీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం



సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 12, ప్రతినిధి: అందోల్ నియోజకవర్గ పరిధిలోని సంగారెడ్డి జిల్లా చిన్న చెల్మెడ గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజ నరసింహ ఆదేశాల మేరకు సోమవారం ఈ పనులను ప్రారంభించారు. పెద్ద మసీదు వద్ద నుంచి ఒగ్గు సోమయ్య ఇంటి వరకు, అలాగే అయ్యాల జగదాంబ ఇంటి నుంచి పులగం వెంకటయ్య ఇంటి వరకు రోడ్ల నిర్మాణం చేపట్టారు. గ్రామ సర్పంచ్ రుద్ర గాయత్రి కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మంతూర్ సుధాకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పిల్లోడి సతీష్, మాజీ మండల అధ్యక్షుడు తాటిపల్లి రామిరెడ్డి, సీనియర్ నాయకులు ఖమ్మంపల్లి సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి హాజరైన ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు పనుల ప్రారంభానికి సహకరించగా, కాంగ్రెస్ పార్టీ నాయకుడు రుద్ర కృష్ణ హాజరైన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

# బోరంచలో నల్ల పోచమ్మ తల్లి జాతరకు లైటింగ్ ఏర్పాట్లు వేగవంతం




సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 12, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా బోరంచ గ్రామంలోని శ్రీ నల్ల పోచమ్మ తల్లి దేవస్థానంలో నిర్వహించనున్న 7 వారాల మహా జాతర సందర్భంగా ఆలయ అలంకరణ ఏర్పాట్లు వేగవంతమయ్యాయి. గుడి పైభాగంలో సీరియల్ కలర్ లైట్స్ ఏర్పాటు కోసం దాతలు అందించిన విరాళాలతో హైదరాబాద్‌కు వెళ్లి లైటింగ్ సామగ్రి, లైటింగ్ బోర్డులు కొనుగోలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు సిద్ధయ్య స్వామి, ఆలయ చైర్మన్ మల్లయ్య, ఆలయ సిబ్బంది శేఖర్‌తో పాటు భక్తులు గొల్లపాపని నర్సింలు, గుడిమె హన్మంతు పాల్గొన్నారు. రానున్న జాతరను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు కొనసాగుతున్నాయి.

# ఫూలే స్ఫూర్తితో సమాజాభివృద్ధి





సందేశం టైమ్స్, మెదక్, ఏప్రిల్ 12, ప్రతినిధి: మహాత్మా జ్యోతిరావు ఫూలే 200వ జయంతి వేడుకలు మెదక్ జిల్లా కేంద్రంలోని ధ్యాన్చంద్ చౌరస్తాలో వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, మున్సిపల్ చైర్మన్ రాధిక భూపతి రాజు, వైస్ చైర్మన్ నరేష్, మెదక్ ఆర్డీవో రమాదేవి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, తాసిల్దార్ లక్ష్మణ్ బాబు తదితర ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి ఫూలే విగ్రహానికి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు ఫూలే సమాజంలో సమానత్వం, విద్యా విస్తరణ, మహిళా సాధికారత కోసం చేసిన కృషి చిరస్మరణీయమని, అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన సేవలు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొంటూ ప్రతి ఒక్కరూ విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని, సమాజంలో వివక్ష లేకుండా అందరికీ సమాన అవకాశాలు కల్పించడమే ఫూలే ఆశయమని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో వివిధ కుల సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# ఐలాపూర్ కూల్చివేతలపై హైకోర్టు స్టే లేదని స్పష్టం

సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 12, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం ఐలాపూర్‌లో జరిగిన హైడ్రా కూల్చివేతలపై కమిషనర్ రంగనాథ్ స్పందిస్తూ హైకోర్టు స్టే ఇచ్చిందన్న ప్రచారాన్ని ఖండించారు. ప్రభుత్వ భూములను ఆక్రమించి 2006లో నిర్మించిన ఫార్మ్‌హౌస్‌ను కేంద్రంగా చేసుకుని సుమారు 40 ఎకరాలను కబ్జా చేసినట్లు తెలిపారు. కోర్టు ఆదేశాలను ఉల్లంఘిస్తూ నిర్మించిన అక్రమ నిర్మాణాలను మాత్రమే తొలగించామని స్పష్టం చేశారు. ఈ క్రమంలో అక్రమంగా నిర్మించిన 6 అంతస్తుల భవనాన్ని భారీ పోలీస్ బందోబస్తు మధ్య కూల్చివేసినట్లు వెల్లడించారు. హైడ్రాపై సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని ప్రజలకు సూచించారు.



# మహాత్మ జ్యోతిరావు పూలేకు ఘన నివాళులు అర్పించిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

సందేశం టైమ్స్, పటాన్చెరు, ఏప్రిల్ 12, ప్రతినిధి: మహాత్మ జ్యోతిరావు పూలే 199వ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో అట్టడుగు వర్గాలను చైతన్యపరచడంలోనే కాకుండా వెనుకబడిన వర్గాల బాలికల కోసం పాఠశాలలను స్థాపించిన మహోన్నత వ్యక్తి పూలే అని కొనియాడారు. మహనీయుల స్ఫూర్తిని భవిష్యత్తు తరాలకు చేరవేయాలనే లక్ష్యంతో నియోజకవర్గ వ్యాప్తంగా మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శివానందం, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, సీనియర్ నాయకులు రుద్రారం శంకర్, వెంకటేష్, శ్రీరాములు, చంద్రశేఖర్, వివిధ దళిత సంఘాల ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక హెల్త్ వీక్‌లో భాగంగా డ్రగ్స్ కంట్రోల్ రెగ్యులేటరీ స్ట్రెంథనింగ్ డే అవగాహన ర్యాలీ



సందేశం టైమ్స్, మెదక్, ఏప్రిల్ 12, ప్రతినిధి: ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా హెల్త్ వీక్ సందర్భంగా డ్రగ్స్ కంట్రోల్ రెగ్యులేటరీ స్ట్రెంథనింగ్ డే కార్యక్రమంలో మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు మరియు యువతలో చైతన్యం నింపేందుకు మెదక్ జిల్లా కేంద్రంలోని రాందాస్ చౌరస్తా నుండి మెదక్ ఎన్జీవో భవన్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్ ప్రారంభించారు. అనంతరం ఎన్జీవో భవన్ సమావేశ మందిరంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్, జిల్లా సమన్వయ ఆరోగ్య సేవల అధికారి శివదయాల్, పోలీస్ శాఖ అధికారులు మరియు ఆరోగ్య సిబ్బంది కలిసి పాల్గొని మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

# యువతను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచాలి: జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



సందేశం టైమ్స్, మెదక్, ఏప్రిల్ 12, ప్రతినిధి: యువతను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పిలుపునిచ్చారు. శనివారం మెదక్ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీరామ్, డీసీహెచ్ఎస్ డాక్టర్ శివదయాల్, ఆసుపత్రి సూపరింటెండెంట్ సునీతాదేవి తదితరులతో కలిసి మత్తు పదార్థాల చికిత్స కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం చికిత్స కేంద్రంలోని ల్యాబ్‌లు, కౌన్సిలింగ్ ప్రదేశం, చికిత్స విధానాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. సూపరింటెండెంట్ ఛాంబర్‌లో వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా ఉండాలని, చెడు వ్యసనాలకు లోనైన వారికి తక్షణమే చికిత్స అందించి సాధారణ జీవితానికి తీసుకురావాలని వైద్యులకు సూచించారు. మత్తు పదార్థాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. మత్తు పదార్థాలకు బానిసైతే జీవితాలు చీకటి మార్గంలోకి వెళ్తాయని హెచ్చరిస్తూ, యువత సన్మార్గాన్ని ఎంచుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మత్తు పదార్థాల నియంత్రణపై నిర్వహించిన ఉపన్యాసం, వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలలో విజేతలైన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, షీల్డులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ప్రసన్నకుమార్, సీఐ మహేష్, వైద్యాధికారులు, వైద్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పూలే ఆశయాలు సమాజానికి మార్గదర్శకం: ఎమ్మెల్యే చింత ప్రభాకర్



సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 12, ప్రతినిధి: మహనీయ సామాజిక సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పక్కన ఉన్న పూలే విగ్రహానికి ఎమ్మెల్యే చింత ప్రభాకర్, జిల్లా కలెక్టర్ కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి చేసిన సేవలు అమోఘమని, మహిళా విద్య, సమాన హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం దేశానికి మార్గదర్శకమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ పూలే ఆశయాలను ఆచరిస్తూ సమాజంలో సమానత్వం సాధించేందుకు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఆర్. వెంకటేశ్వర్లు, కార్యదర్శి నర్సింలు, డా. శ్రీహరి, కౌన్సిలర్లు లాడే మల్లేశం, మనీలా, నవీన్, జలేందర్, కొత్తపల్లి శ్రీకాంత్, శ్రవణ్ రెడ్డి, అజీమ్, చింటూ, దిలీప్, ప్రదీప్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు




సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 12, ప్రతినిధి: మహాత్మ జ్యోతిరావు పూలే 200వ జయంతి వేడుకలు జిల్లాలో ఘనంగా నిర్వహించగా ఈ సందర్భంగా టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత సంతోష్, అదనపు కలెక్టర్ పాండు తదితరులు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు మరియు అనంతరం వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి ఉత్సవ కార్యక్రమంలో పాల్గొని పూలే చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు ఈ సందర్భంగా టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావు పూలే సమాజంలో సమానత్వం మరియు మహిళా విద్య కోసం చేసిన కృషి చిరస్మరణీయమని ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు కల్పించాలన్న ఆయన ఆశయాలు నేటి సమాజానికి మార్గదర్శకమని పేర్కొన్నారు అలాగే మహిళల విద్యాభివృద్ధికి ఆయన చేసిన సేవల వల్లే నేడు మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉన్నారని తెలిపారు జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ పూలే సమానత్వం, విద్యా విస్తరణ, మహిళా సాధికారత కోసం అహర్నిశలు కృషి చేసిన మహనీయుడని సావిత్రిబాయి పూలే సేవలు కూడా సమాజానికి ఆదర్శమని పేర్కొన్నారు పూలే దంపతుల స్ఫూర్తితో యువత సమాజ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, కుల సంఘాల ప్రతినిధులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, యువత, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## మెదక్ జిల్లా నర్సాపూర్ డివిజన్ బీసీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిబా ఫూలే జయంతి కార్యక్రమం

సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 12, ప్రతినిధి: మెదక్ జిల్లా నర్సాపూర్ డివిజన్ బీసీ ఉద్యోగుల సంఘం (టిబీసీయూఎస్) ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిబా ఫూలే జయంతి మరియు సంస్మరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించగా ఈ కార్యక్రమంలో బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు కె. శేషాచారి మాట్లాడుతూ సామాజిక సమానత్వం, వెనుకబడిన వర్గాల అభివృద్ధి, స్త్రీ విద్య, స్త్రీ సమానత్వం, బహుజన వర్గాల సాధికారత కోసం ఫూలే చేసిన కృషి నేటికీ ఎంతో మందికి స్ఫూర్తిదాయకమని పేర్కొంటూ ఆయన ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు అలాగే నర్సాపూర్ డివిజన్ అధ్యక్షులు డి. ప్రసన్న కుమార్ మాట్లాడుతూ ఫూలే ఆశయాలను కొనసాగిస్తూ బీసీ ఉద్యోగ ఉపాధ్యాయుల హక్కుల సాధన కోసం పోరాడతామని, నర్సాపూర్ డివిజన్‌లో బీసీ ఉద్యోగ భవన్ నిర్మాణం మరియు మహాత్మ జ్యోతిబా ఫూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాల ఏర్పాటు కోసం కృషి చేస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి ఈ. వెంకటకృష్ణ, జిల్లా బాధ్యులు ఎన్. నరేందర్ గౌడ్, భవానీ ప్రసాద్, మల్లేశం, డివిజన్ బాధ్యులు సంతోష్ కుమార్, రవికుమార్, పండరి, కృష్ణమూర్తి, శ్రీనివాసరావు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



## మహాత్మా జ్యోతిరావు ఫూలే జయంతి వేడుకలు

సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 12, ప్రతినిధి: 199వ మహాత్మా జ్యోతిరావు ఫూలే జయంతి వేడుకలు మునిపల్లి దత్తాత్రి రీజినల్ ప్రెసిడెంట్ తెలంగాణ విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం సంగారెడ్డి సర్కిల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించగా ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ముత్యం వెంకన్న గౌడ్, స్టేట్ జనరల్ సెక్రటరీ పి. యాదగిరి, కంపెనీ ప్రెసిడెంట్ బొబిలి మురళి, కంపెనీ సెక్రటరీ ప్రేమకుమార్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఏ. బాలకృష్ణ, రీజినల్ సెక్రటరీ కె. ప్రభు, అదనపు సెక్రటరీ ప్రశాంత్, ట్రెజరర్ ఎస్ఎంటి కళ్యాణి, ఎస్ఎంటి నాగరాణి, మధు గౌడ్, ఆర్. సుధీర్ కుమార్, సూపరింటెండింగ్ ఇంజనీర్ భాస్కర్, డీఈ పటాన్చెరు తదితరులు పాల్గొని పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



## పూలే ఆశయాల సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి: మున్సిపల్ చైర్‌పర్సన్, అదనపు కలెక్టర్

సందేశం టైమ్స్, సూర్యాపేట, ఏప్రిల్ 12, ప్రతినిధి: సామాజిక న్యాయం కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మోరిశెట్టి నివేదిత లక్షాధి పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎంజీ రోడ్ సర్కిల్ వద్ద వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె. సీతారామారావుతో కలిసి ఆమె పాల్గొని పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ పూలే జయంతి సందర్భంగా ఆయనను స్మరించుకోవడం గొప్ప గౌరవమని, సమానత్వ సమాజ నిర్మాణంలో పూలే కీలక పాత్ర పోషించారని, ఆ కాలంలో కుల, మత భేదాల మధ్య ఉన్న అసమానతలపై పోరాడి సామాజిక సంస్కరణలకు శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. ముఖ్యంగా తన భార్య సావిత్రిబాయి పూలేకు విద్యాబోధన చేసి బాలికల విద్యకు మార్గం సుగమం చేసిన గొప్ప సంస్కర్తగా పూలే నిలిచారని తెలిపారు. అదనపు కలెక్టర్ కె. సీతారామారావు మాట్లాడుతూ కుల వివక్ష లేకుండా సమాజం అభివృద్ధి చెందాలని, ప్రతి ఒక్కరూ విద్యను పొందాలని పూలే బోధించిన సిద్ధాంతాలు నేటికీ మార్గదర్శకమని పేర్కొంటూ రాష్ట్ర ప్రభుత్వం గురుకులాలు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు వంటి కార్యక్రమాల ద్వారా పేదలకు నాణ్యమైన విద్య అందిస్తున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో, ఏసీపీ, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు, కుల సంఘ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## హైడ్రా కూల్చివేతలు

సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 12, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా అమీన్పూర్ జీహెచ్ఎంసీ పరిధిలో శనివారం హైడ్రా కూల్చివేతలు చేపట్టింది. ఐలాపూర్‌లోని కోర్టు పరిధిలో ఉన్న 1264 ఎకరాల భూమిని కాపాడేందుకు హైడ్రా సిబ్బంది భారీగా మోహరించి కూల్చివేతలు నిర్వహించారు. ఈ క్రమంలో సుప్రీంకోర్టు న్యాయవాది ముఖి గెస్ట్ హౌస్‌ను కూడా అధికారులు కూల్చివేస్తున్నట్లు సమాచారం. పోలీస్ బలగాలు పెద్ద ఎత్తున మోహరించి భద్రతా ఏర్పాట్లు చేపట్టాయి. కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ ఇనాం భూములను గుర్తించి ఫెన్సింగ్ చేసే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. దీంతో అక్కడ ఘర్షణ వాతావరణం నెలకొంటుందన్న ఆందోళనతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అదే ప్రాంతంలోని ఓ భారీ భవనంలో అద్దెకు ఉన్న వారందరినీ ఖాళీ చేయించి హైడ్రా కూల్చివేతలు కొనసాగిస్తున్నట్లు సమాచారం.



## కాంగ్రెస్ పార్టీ కక్షపూరిత చర్య: మాణిక్ యాదవ్ ఇంటిపై హైడ్రా దాడి

సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 12, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా అమీన్పూర్ జీహెచ్ఎంసీ పరిధిలో శనివారం ఐలాపూర్‌కు చెందిన మాణిక్ యాదవ్ ఇంటిపై హైడ్రా అధికారులు దాడి చేశారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. మాణిక్ యాదవ్ కార్పొరేటర్ బరిలో ఉంటాడని భావించి కాంగ్రెస్ పార్టీ కక్షపూరితంగా వ్యవహరిస్తోందని, తమ వద్ద లీగల్ డాక్యుమెంట్లు ఉన్నప్పటికీ చర్యలు కొనసాగించారని వారు పేర్కొన్నారు. హైడ్రా పేరుతో ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని, ఇది దుర్మార్గమైన పాలన, మోసపూరిత చర్యలని బీఆర్ఎస్ వర్గాలు విమర్శించాయి. అమీన్పూర్ నుంచి మాణిక్ యాదవ్ కార్పొరేటర్‌గా గెలుస్తాడనే ఉద్దేశంతోనే లక్ష్యంగా చేసుకున్నారని ఆరోపిస్తూ కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు చేశారు.



## తిరుమలాయపాలెం మండలంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటన: అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

సందేశం టైమ్స్, తిరుమలాయపాలెం, ఏప్రిల్ 12, ప్రతినిధి: తిరుమలాయపాలెం మండలంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా కల్యాణలక్ష్మి, షాది ముబారక్, సీఎం ఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేసి వారికి అభినందనలు తెలిపారు. అలాగే నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఇందిరమ్మ గృహ ప్రవేశ కార్యక్రమాలకు హాజరై లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ కానుకలను అందజేశారు. పాలేరు నియోజకవర్గంలో జరిగిన ఈ పర్యటనలో మంత్రి గారి వెంట పెద్ద సంఖ్యలో అభిమానులు, కార్యకర్తలు పాల్గొనగా కార్యక్రమం ఆద్యంతం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది.



## మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయ సాధనే దివ్యాంగుల ఆత్మగౌరవ పోరాటానికి స్ఫూర్తి

### NPRD INDIA జాతీయ అధ్యక్షులు తుడుం రాజేందర్

సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 12, ప్రతినిధి: మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలే నేటి దివ్యాంగుల హక్కుల సాధనకు అసలైన మార్గదర్శకమని NPRD INDIA జాతీయ అధ్యక్షులు తుడుం రాజేందర్ అన్నారు. శనివారం హైదరాబాద్ అంబర్‌పేటలోని పూలే విగ్రహం వద్ద ఆయన 199వ జయంతిని పురస్కరించుకుని NPRD INDIA ఆధ్వర్యంలో నిర్వహించిన నివాళి కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కాసా ప్రవీణ్, అంబర్‌పేట నియోజకవర్గ అధ్యక్షుడు తాళ్ల బాబూరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ సింగం నర్సింగ్, కార్యదర్శి గౌలికర్ నవీన్, ఉపాధ్యక్షులు ఎం. శ్రీనివాస్, సరితబాయి, శివాని తదితరులతో కలిసి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా తుడుం రాజేందర్ మాట్లాడుతూ పూలే కలలుగన్న సమానత్వం దివ్యాంగుల జీవితాల్లో ప్రతిబింబించాలని, శారీరక వైకల్యం కంటే సామాజిక వివక్షే పెద్ద అడ్డంకి అని పేర్కొంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్ కేటాయింపులు మరియు రిజర్వేషన్ల అమలులో దివ్యాంగులకు జరుగుతున్న అన్యాయంపై పూలే చూపిన పోరాట స్ఫూర్తితో సమాన హక్కుల సాధన కోసం ఉద్యమం కొనసాగించాల్సిన అవసరం ఉందని అన్నారు.




## వాట్సాప్ ద్వారా ఇంటర్ ఫలితాలు తెలుసుకునే అవకాశం: ప్రభుత్వం గుడ్ న్యూస్

సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 12, ప్రతినిధి: ఇంటర్మీడియట్ విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. ఆదివారం మధ్యాహ్నం 12.30 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాలను విడుదల చేయనున్నారు. ఈసారి విద్యార్థులు ఫలితాలను ఆన్‌లైన్ పోర్టల్‌లతో పాటు నేరుగా వాట్సాప్ ద్వారా కూడా తెలుసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. 8096958096 నంబర్‌కు వాట్సాప్‌లో “హాయ్” అని మెసేజ్ పంపితే సర్వీస్ ఆప్షన్‌లు కనిపిస్తాయని, అందులో BIE Exam Result ఎంపిక చేసి హాల్ టికెట్ నంబర్, సంవత్సరం (ఫస్టియర్/సెకండియర్), స్ట్రీమ్ (జనరల్/వొకేషనల్) వివరాలు నమోదు చేస్తే ఫలితాలు వెంటనే మొబైల్‌లో అందుతాయని అధికారులు తెలిపారు. మీసేవ కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, పోర్టల్ లాగిన్ లేకుండానే క్షణాల్లో ఫలితాలు పొందే సౌకర్యం కల్పించడం విద్యార్థులకు పెద్ద ఉపశమనం కలిగించనుందని ప్రభుత్వం పేర్కొంది.




## సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి: ప్రజలకు సూచన

సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 12, ప్రతినిధి: సైబర్ నేరాల నుండి తమను తాము, తమ కుటుంబ సభ్యులను రక్షించుకోవడానికి ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. ప్రస్తుతం పెరుగుతున్న ఆన్‌లైన్ మోసాలు, ఫేక్ లింకులు, ఫోన్ కాల్స్ ద్వారా జరుగుతున్న ఆర్థిక మోసాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వివిధ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ కార్యక్రమాల్లో సైబర్ నేరాల నుంచి ఎలా జాగ్రత్త పడాలి, అనుమానాస్పద లింకులు మరియు ఆఫర్లను ఎలా గుర్తించాలి, వ్యక్తిగత బ్యాంకింగ్ వివరాలను ఎలా రక్షించుకోవాలి వంటి విషయాలపై సూచనలు అందిస్తున్నారు. ప్రజలు తెలియని ఆన్‌లైన్ ఆఫర్లు లేదా డబ్బు సంపాదన పేరుతో వచ్చే ఆకర్షణీయ సందేశాలను నమ్మకుండా జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. సైబర్ మోసాలపై అవగాహన పెంచుకోవడం ద్వారా ఆర్థిక నష్టాలను నివారించవచ్చని, ప్రతి ఒక్కరూ ఇలాంటి సమాచారాన్ని తమ కుటుంబ సభ్యులు మరియు బంధుమిత్రులతో పంచుకోవాలని కోరుతున్నారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times,(పబ్లికేషన్: అమృత వెంకట్ మీడియా పబ్లికేషన్ ప్రైవేట్ లిమిటెడ్.) ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / publisher : కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.